# వాన

సామాన్యుడి జీవితంలో కష్టాలకి మల్లే ఆకాశమంతా మబ్బులు కమ్మాయి.

రాష్ట్రపతి అధికారానికి మల్లే – ఆకాశంలో సూర్యుడు వుండీ లేనట్టుగా వున్నాడు.

"రాబోయే ఇరవైనాలుగ్గంటల్లో ఆకాశం మేఘావృతమై వుంటుంది. ఉరుములతో కూడిన జల్లులు విస్తృతంగా పడవచ్చు" అని, అప్పుడే రేడియోలో చెప్తున్నారు.

అయితే అసలివ్వాళ వర్షమే రాదని చాలామంది అనుకున్నారు గాని – అయినా వర్షం వచ్చింది.

రావడమే మంచి జోరుగా వచ్చింది.

డబ్బున్నవాడికి లేనివాడి మీద కోపమొచ్చినట్టుగా, నల్లబజారు వ్యాపారమున్న వాడికి లాభాలొచ్చినట్టుగా, ఎన్నికలముందు రాజకీయనాయకుడికి బీద ప్రజల మీద దయవచ్చినట్టుగా, – వర్షం జోరుగా వచ్చింది, తెల్లడబ్బుకంటే నల్లడబ్బే ఎక్కువున్న వాడిలా, ఆకాశంలో తెల్లమబ్బుల కంటే నల్లమబ్బులే ఎక్కువైపోయాయి.

ఎలక్షన్లో గెలిచిన నాయకుడిలా సూర్యుడసలు కనబడ్డమే మానేశాడు. మబ్బుల వెనక మటుమాయమై పోయాడు.

దేశంలో ప్రజాస్వామ్యానికి మల్లే వుండి కూడా పనికిరాకుండా పోయాడు.

పట్టపగలే చీకటొచ్చింది.

అయిదు నిమిషాల్లో రోడ్డంతా ఖాళీ అయిపోయింది.

ఆ పక్కనా ఈ పక్కనా వున్న భవనాల, దుకాణాల, హోటళ్ళ, పంచన చేరి జనం వానలోకి చూస్తూ నిలబడ్డారు.

రాజిగాడు కూడా రిక్షా రోడ్డు పక్కకి లాగి, తనో చిన్న హోటలు వరండాలో జేరి, ఒక మూల నిలబడ్డాడు.

తల దాచుకోడానికొచ్చిన వాళ్ళతోనూ, లోపల్నించి బయటి కొచ్చి, వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురుచూస్తూ నిలబడ్డవాళ్ళతోనూ, ఆ హోటల్ వరండా అప్పటికే నిండి పోయింది.

ఆ సమయాన అక్కడ చేరినవాళ్ళలో పెద్దలున్నారు; పెద్ద మనుషులున్నారు; అధికారులున్నారు; అనధికారులున్నారు; స్టూడెంట్లున్నారు; గుమాస్తాలున్నారు; వ్యాపారస్తులున్నారు - ఇంకా చాలామంది వున్నారు.

రాజిగాడు వాళ్లెవరి కోవకీ చెందినవాడు కాడు. రిక్షా లాక్కుని బ్రతికే సామాన్యుడు, లేదా - రిక్షా లాక్కుని కూడా బ్రతకలేకపోతున్న, చావనూ లేకపోతున్న దౌర్భాగ్యుడు.

అందుకే రాజిగాడు అందరికీ ఎడంగా - ఒక మూల నక్కినుంచున్నాడు.

అందరిలాగే వర్షంలోకి చూస్తున్నాడు. వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని చూస్తున్నాడు. అయితే వర్షం పూర్తిగా తగ్గాలని లేదు రాజిగాడికి. పూర్తిగా తగ్గకుండా, కొంచెం కొంచెం పడుతూ వుంటేనే తనకి మంచి బేరాలొస్తాయి.

నడిచి వెళ్తే తడిసిపోయేంత ఎక్కువగానూ, రిక్షాలో వెళ్తే తడవనంత తక్కువగానూ పడాలి వర్షం.

అలా పడితే రాజిగాడికి నాలుగు బేరాలు దొరుకుతాయి.

కాని - ఇప్పుడు రిక్షాలో వెళ్ళినా కూడా ముద్దముద్దగా తడిసిపోయేంత ఎక్కువగా పడ్తోంది వర్షం. అంత వర్షంలో ఏ టాక్సీలోనో తప్ప, రిక్షాలో ఎవరూ ఎక్కరు. వర్షం తగ్గేదాకా ఎక్కడో ఆగి, అప్పుడు కాని రోడ్డు మీదికి రారు.

ఇదంతా ఆలోచిస్తూ - "సీ, యెదవ్వాన" - అని వర్షాన్ని తిట్టుకున్నాడు రాజిగాడు.

తిట్టినా వర్షం తగ్గలేదు.

ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది.

అప్పుడే లోపల పూరీలు, ఆ పైన రవ్వదోసె తిని, కాఫీ తాగి బయటికొచ్చిన కాలేజీ కుర్రాడు - వక్క పొడి వేసుకొని సిగరెట్ వెలిగించి, రోడ్డు మీదికి చూస్తూ - "హెల్ విత్ ది రెయిన్" - అని ఇంగ్లీషులో వర్షాన్ని తిట్టాడు. కాలేజీ కుర్రాడు ఇంగ్లీషులో

తిట్టినా కూడా వర్షం తగ్గలేదు; కురుస్తూనే వుంది. మరి కాస్త పెరిగింది కూడాను. అయితే వర్షాన్ని ఇంగ్లీషులో తిట్టిన కాలేజీ కుర్రాడు ఆ వెంటనే నాలిక్కరుచుకున్నాడు.

వర్షంలో సగం తడిసి అక్కడికొచ్చి ఓ పక్కన నిలబడ్డ అమ్మాయి సగం తడిసిన చీరలో చాలా అందంగా కనబడిందా కుర్రాడికి, ఈ వర్షమే రాకపోతే, ఇంత "బ్యూటిఫుల్ గాల్"ని, యింత సేపిలా హాయిగా చూడ్డానికి వీలయ్యేదా అని తనకి తానే ప్రశ్నించుకుని, వీలయ్యేది కాదని తనకి తానే సమాధానం చెప్పుకుని, వర్షాన్ని ఇంగ్లీషులో మెచ్చుకుని, ఆ అమ్మాయి వంక రెప్పవేయకుండా చూస్తూ నిలబడ్డాడు.

ఎడతెరిపి లేకుండా కుంభవృష్టిగా కురుస్తున్న ఆ వర్షాన్ని, ఆ కాలేజి కుర్రాడిలాగే, మెచ్చుకుంటున్న వాళ్లింకా మరికొంతమంది లేకపోలేదు.

వర్షమిలాగే కురుస్తూవుంటే, తలదాచుకోడానికొచ్చిన వాళ్లంతా తలో కప్పుడు కాఫీ అయినా తాగకపోతారా అన్న ఆనందంతో, హోటల్ అయ్యరు తన కుర్చీలోంచి లేవకుండానే బయటికి చూస్తూ వర్షాన్ని మెచ్చుకున్నాడు.

వర్షం యివ్వాళ్టిలాగే యింకో నాల్రోజులు పడితే తన పంట పండుతుందని రెయిన్కోటూ, గొడుగులూ అమ్మే వ్యాపారి వర్షాన్ని మరీ మరీ మెచ్చుకున్నాడు.

పని అసల్లేకుండా, డబ్బు చాలా వున్న ఒక ధనవంతుడు – తన యింటి మూడో అంతస్తులో పట్టె మంచమ్మీద ఏటవాలుగా పడుకుని, ఆ వానలో వెచ్చగా వుండే పానీయం సేవిస్తూ – వర్షాన్ని చాలా బాగా మెచ్చుకున్నాడు.

కొత్త పెళ్ళాం కౌగిట్లో లోకాన్ని మర్చిపోయిన ఒక యువకోద్యోగి – ఉద్యోగం కంటే పెళ్ళాం కౌగిలే బావుందనిపించి, ఈ వర్షంలో ఇంకా బావుంటుందనిపించి వర్షాన్ని అపరిమితంగా మెచ్చుకున్నాడు.

తనని మెచ్చుకునే వాళ్ళుకూడా యింతమంది వున్నారు గదా అనుకుని, వర్షం తనకి తానే మురిసిపోయి మరింత జోరుగా కురవడం ప్రారంభించింది.

వర్షం పెరిగిన కొద్దీ రాజిగాడి మనసులో దిగులు పెరిగింది. వర్షం తగ్గితే తప్ప వాడికి బేరం దొరకదు. బేరం దొరికతే తప్ప తన పొట్ట నిండదు. ఇంట్లో వాళ్ళ పొట్టలు నిండవు.

పొద్దుట్నించీ అసలు బేరం దొరక లేదు.

నిన్న కూడా అంతంత మాత్రమే.

నిన్న అర్ధాకలితో గడిపాడు.

ఇవ్వాళింత వరకూ అసలు ఏమీ తినలేదు.

అప్పుడే పొద్దు చాలా గడిచింది. గడిచిపోతోంది.

వర్షం తగ్గలేదు, తగ్గేట్టు లేదు.

రాజిగాడికి ఆకలిగా వుంది, చిరాగ్గా వుంది.

కోపంగా వుంది.

వర్షం తగ్గలేదు.

అక్కడికి రెండు మైళ్ళ దూరాన – అంత వర్షానికి నిలుస్తుందా అన్నట్టుగా వున్న ఒక గుడిసెలో – అసలీమె లేచి నిలబడుతుందా అన్నట్టుగా వున్న రాజిగాడి ముసలి తల్లి – గుడిసె గుమ్మంలో కూల బడి, బయటికి, ఎడతెగని వర్షంలోకి – దిగులు దిగులుగా చూస్తోంది.

ఆమె పక్కనే ఎముకల పోగుల్లా కూర్చుని వున్న యిద్దరు పిల్లలు – రాజిగాడి తమ్ముళ్ళు – అప్పుడప్పుడే ముసురు కుంటున్న మసక చీకట్లోకి, ఆగకుండా కురుస్తున్న వర్షంలోకి అలాగే దిగులు దిగులుగా, అన్న వస్తాడేమో, తినడానికేమైనా తెస్తాడేమో నని ఆశ ఆశగా చూస్తున్నారు.

హోటల్ వరండాలో రాజిగాడింకా అలాగే నిలబడివున్నాడు.

రాజిగాడికి ఆకలేస్తోంది.

రాజిగాడి ముసలి తల్లికి ఆకలేస్తోంది.

రాజిగాడి తమ్ముళ్ళకి – వొంట్లో ఎముకలు తప్ప యింకేమీ లేనివాళ్ళకి – వాళ్ళకి కూడా ఆకలేస్తోంది.

అయినా వర్షం తగ్గలేదు.

ఆ వేళంతా తగ్గలేదు.

రాజిగాడికి బేరం దొరకలేదు.

వాడికీ, వాడి తల్లికీ, వాడి తమ్ముళ్ళకీ ఆ వేళ తిండి దొరకలేదు.

○

*("జీవనాడి" – సెప్టెంబర్ – 1973)*